క్లుప్తంగా

దివ్యాంగుల కార్పొరేషన్ పదవుల నియామకంలో ప్రభుత్వం తాత్సారం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమిస్తున్నా దివ్యాంగుల కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్ల పదవులను నియమించడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తుందని అమలాపురానికి చెందిన ఏపీ దివ్యాంగుల మహా సంఘటన్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు రాష్ట్ర కార్పొరేషన్లకు పదవుల భర్తీ జరుగుతున్న క్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్‌కు కూడా పదవుల భర్తీ తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగుల కార్పొరేషన్ పదవుల భర్తీ విషయంలో సీఎం చంద్రబాబు చొరవ చూపాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని దివ్యాంగులకు రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ ప్రత్యేక స్థానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టేట్‌హుడ్ కోసం సంతకాల సేకరణ

యానాం: కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న పుదుచ్చేరికి స్టేట్‌హుడ్ హోదా కల్పించాలని కోరుతూ గురువారం సంతకాల సేకరణ ఉద్యమాన్ని సీఎం రంగసామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్‌హుడ్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంగా ఉండడంతో కార్యనిర్వాహక అధిపతిగా లెఫ్టినెంట్ గవర్నర్ ఉంటున్నారన్నారు. అయితే స్టేట్‌హుడ్ ఇవ్వడం ద్వారా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా గెలిచిన సీఎంతో సహా ఎమ్మెల్యేలకు పాలనాపరమైన హక్కులు, అధికారాలు వస్తాయని అందువల్లే స్టేట్‌హుడ్‌ను డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజామద్దతుతో సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పలు సామాజిక సంస్థలు, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే నెహ్రూ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు తాటాకిళ్లు దగ్ధం



తూర్పులంకలో పిడుగుపాటుకు దగ్ధమవుతున్న తాటాకిళ్లు

అల్లవరం: మండలంలోని తూర్పులంక గ్రామంలో పిడుగుపాటుకు మందా వీర వెంకట సత్యనారాయణకు చెందిన తాటాకిళ్లు దగ్ధమైంది. పిడుగు పడే సమయానికి ఇంట్లోనే ఉన్న వీర వెంకట సత్యనారాయణ అప్రమత్తమై హుటాహుటిన బయటకు పరుగులు తీశాడు. అప్పటికే పిడుగుపాటుకు మంటలు వ్యాపించి ఇళ్లంతా పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ. 2.5 లక్షలు నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. కట్టు బట్టలు మినహా సర్వం కోల్పోయామని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. బాధితులను ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు, సర్పంచ్ కడలి గంగాజలం పరామర్శించి ధైర్యం చెప్పారు.

హైందవ ధర్మంపై అవగాహన



నీలపల్లి శ్రీమన్నారాయణ-శ్రీ హరేకృష్ణ ధ్యాన మందిరాన్ని సందర్శించిన తమిళనాడు మనుజ్యోతి ఆశ్రమ నిర్వాహకులు ఉఫాజ్ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లిలోని శ్రీమన్నారాయణ, హరేకృష్ణ ధ్యాన మందిరాన్ని తమిళనాడు మనుజ్యోతి ఆశ్రమ నిర్వాహకులు బ్రదర్ ఉఫాజ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, జయప్రకాష్, శివ, శ్రీనివాస్, వెంకటానందం, తదితరులు పాల్గొన్నారు.

చేపల లారీ బోల్తా



బోడసకుర్రులో బోల్తా పడిన లారీ

అల్లవరం: మండలంలోని బోడసకుర్రు గ్రామ పంచాయితీ పరిధి మేకల వంతెన వద్ద చేపల లోడుతో వెళ్తున్న లారీ గురువారం బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఈ ప్రమాదానికి గురైనట్టు లారీ డ్రైవర్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదని వారు తెలిపారు.

సీఎం, ఎల్జీల మధ్య కోల్డ్‌వార్

యానాం: అధికారుల పనితీరు పట్ల తాను అసంతృప్తిగా ఉన్నానని బదిలీలను కూడా ప్రారంభించలేక పోతున్నానని సీఎం రంగసామి, కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయకి బహిరంగంగా ఫిర్యాదు చేశారని మాజీ ముఖ్యమంత్రి నారాయణసామి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవలి పుదుచ్చేరి పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎం రంగసామి, ఎల్జీ కె కైలాషనాథన్ మధ్య కోల్డ్‌వార్ స్పష్టంగా కనిపించిందన్నారు. పరిపాలనా వ్యవహారాల స్థితిపై రంగసామి బహిరంగంగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. అదేవిధంగా ఎల్జీని సైతం మార్చాలని కేంద్రమంత్రితో చర్చించారని ఆయన పేర్కొన్నారు.

దర్జాగా దందా

- గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు
- అక్రమంగా మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు

కాట్రేనికోన: డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో బెల్టు షాపులలో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో జోరుగా అక్రమ దందా సాగుతోంది. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టు కోవాలనే చందాన అక్రమ మద్యం విక్రయదారులు వ్యవహరిస్తున్నారు. మండలంలో చెయ్యేరులో-2, కాట్రేనికోనలో- 3, వేట్లపాలెంలో-1, కందికుప్పలో-1, పల్లంకుర్రులో-1 చొప్పున ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. ఇందులో జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మండలంలో మంచినీరు దొరకని గ్రామాలు ఉన్నాయి కానీ.. వాడవాడలా బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు లేని గ్రామాలు లేవనడంలో అతిశయోక్తి లేదు. మండల ప్రధాన కేంద్రం కాట్రేనికోనలో గేటు సెంటరు, సుబ్బారాయుడు గుడి, వంతెన సమీపంలోను, చెయ్యేరు, చెయ్యేరు అగ్రహారం, పెనుమల్లే, ఉప్పాడి ఓఎన్‌జీసీ రోడ్డు సమీపంలోను, కుండలేశ్వరం, వేట్లపాలెం, రాజానగరం, సత్తెమ్మ చెట్టు, కాపులపాలెం, దొంతికుర్రు, పల్లంకుర్రు, కందికుప్ప, పల్లం, కొత్తపాలెం, మొల్లేటి మొగ, చిర్రయానం, బలుసుతిప్పతో పాటు ప్రతి గ్రామ కూడళ్లలోను బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బెల్టుషాపుల్లో యథేచ్ఛగా మద్యం అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అధిక ధరలకు అమ్మకాలు

గ్రామాల్లో వెలసిన బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 ధరలకు అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. మండలంలో బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ,పోర, పల్లం, చిర్రయానం తదితర మత్స్యకార గ్రామాల్లో మద్యం అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.40లకు విక్రయిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. మద్యం అక్రమ అమ్మకాల్లో తమ్ముళ్లకు కాసులు కురిపిస్తున్నాయని చెబుతున్నారు.

పర్మిట్ రూమ్ పేరుతో దందా

ప్రభుత్వం నుంచి అనుమతులు లేకున్నా లైసెన్సు మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. లైసెన్స్ షాపు నుంచి మద్యం బాటిల్స్‌ను మాత్రమే అమ్మకాలు చేయవలసిన ఉంది. షాపులు ప్రధాన రహదారులకు చేరువగా ఉండడం పర్మిట్ రూమ్ అమ్మకాలతో మందు బాబులు ఆగడాలకు అంతు లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. మద్యం సేవించి రోడ్లుపై మందుబాబుల చిందులు, తిష్టవేయడంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

బెల్టు షాపులపై కన్నెత్తి చూడని అధికారులు

వాడవాడలా వెలసిన బెల్టుషాపుల్లో జోరుగా మద్యం అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా సంబంధిత ఎక్సైజ్, పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు రైడింగ్‌కు వస్తున్న సమాచారం మద్యం విక్రయదారులకు ముందుగానే అందుతుందనే ఆరోపణలున్నాయి. మొక్కుబడిగా దాడి చేయడం నామమాత్రంగా కేసులు నమోదు చేసి మమా అనిపిస్తురని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపి అక్రమ మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు, మహిళలు కోరుతున్నారు.



బెల్టు షాపులలో విక్రయిస్తున్న మద్యం

> **కేసులు నమోదు చేస్తున్నాం**
>
> అనధికారికంగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై కచ్చితమైన సమాచారం అందిన మేరకు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల వేట్లపాలెంలో బెల్టు షాపుపై దాడి చేసి కేసు నమోదు చేశాం.
>
> – అవినాష్, ఎస్ఐ, కాట్రేనికోన

సఖి వన్ స్టాప్ సెంటర్ ఔదార్యం



ఐ.పోలవరంలో అనాథను అక్కరకు చేర్చుకున్న సఖి వన్ స్టాప్ సెంటర్ సభ్యులు

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరం పోలీసుస్టేషన్ పరిధిలో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న ఓ యువతిని ఆదుకొని సఖి ఒన్ స్టాప్ సెంటర్ అక్కున చేర్చుకుంది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి సహకారంతో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎ.అంబికాదేవి ఆధ్వర్యంలో బృందం ఐ.పోలవరం చేరుకుని మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న యువతికి సపర్యలు చేసి, ఆహారం అందించి పోలీసుల సహకారంతో గుంటూరు జిల్లా పొన్నూరులో ఉన్న అనాధాశ్రమానికి అప్పగించారు. ఈ సందర్భంగా అంబికాదేవి మాట్లాడుతూ బాధిత యువత ఒడిశాలోని బహద్దూర్ గ్రామానికి చెందినట్టు చెబుతుదని వెల్లడించారు. జిల్లాలో అనాథ, ఆపదలో ఉన్న మహిళలకు సంబంధించిన సమాచారం కాల్ సెంటర్ నెం181 కు ఫోన్‌చేస్తే తక్షణం స్పందించి సేవలందిస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ జన్మదిన వేడుకలు



గోడి గ్రామంలోలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, చెల్లుబోయిన శ్రీను, పార్టీ నాయకులు

అల్లవరం: శాసన మండలి సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ జన్మదిన వేడకలు అల్లవరం మండలం గోడి గ్రామంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు రాజకీయ పార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, ఆయా శాఖల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన అభిమానులు భారీ గజమాలతో ఇజ్రాయిల్ దంపతులను సత్కరించి, కేక్ కటింగ్ చేసి, బాణాసంచా కాల్చారు. వేడుకను పురస్కరించుకుని అమలాపురం పట్టణంలోని ఓల్డేజ్ హోమ్‌లో బొమ్మి నరసింహమూర్తి, మంగాయమ్మ ట్రస్ట్ సహకారంతో వృద్ధులకు అన్నదానం చేశారు. అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, నాయకులు ఒంటెద్దు వెంకన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, వేగిరాజు సాయిరాజు, గొవ్వాల రాజేష్, వంగా గిరిజాకుమారి, సాధనాల శ్రీను, కుంచే రమణారావు, పినిపే జయరాజు, పెయ్యల రమణ, బడుగు శ్రీనివాసరావు, తోట శ్రీను, సూదా గణపతి, రుద్రరాజు సీతారామరాజు, మల్లవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ఐ.పోలవరం: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక కార్యకలాపాల వల్ల మండలంలో సామాన్యులు, పేదలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ పథకాలు దాదాపు నిలిచిపోయాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని పేర్కొన్నారని, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకట పతిరాజు తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ.పోలవరం మండలానికి చెందిన పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీకి చెందిన వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు జగ్గిరెడ్డి గురువారం కొత్తపేటలో కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్థితి, కూటమి పాలన వల్ల మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించినట్టు వెంకట పతిరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. కోనసీమ జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కొత్తపేట మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కలిసి పోరాడదామని జగ్గిరెడ్డి తెలిపారన్నారు. ఎంపీపీ మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరు సతీష్ రాజు, పార్టీ నాయకులు ఢిల్లీ నారాయణ, వడ్డీ గౌతం, మోకా రవి, మెండ వెంకన్న, కాటం సత్తిరాజు, కొమ్మనపల్లి శ్రీను, జ్యోతి, మందపాటి భైరవ స్వామి, విత్తనాల శ్రీను, సకిలే జ్యోతి బాబు, మోర్త చిన్న, కొర్లపాటి శ్రీను, సాధనాల బాబురావు, లంకే సత్యనారాయణ, చప్పిడి బుజ్జి, వాకాడ బుజ్జిలు పాల్గొన్నారు.



చిర్ల జగ్గిరెడ్డిది కలిసిన మండల వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్‌పీఐ అధ్యక్షుడు లోక్

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో భారత రిపబ్లికన్ పార్టీ నాయకుల సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.లోక్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అశోక చక్రవర్తి, వెంకట బాబ్జి, రాజేష్, గౌతమ్ కుమార్, రాంజీ, వెంకటేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

తాళ్లరేవు: మత్స్యకార మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.జి. శ్రీనివాసరావు కోరారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలోని గోదావరి మహాసమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన మత్స్యకార మహళల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న పథకాలను వివరించారు. మత్స్యకార మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ జిలాని, డీపీఎం బూబూరావు, డీపీఎం ఎల్‌హెచ్ కేశవ్, డీపీఎం మార్ట్స్ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ తదితర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఏపీఎం బరుకుల విష్ణుమూర్తి, సిబ్బంది, మత్స్యకార మహిళలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

పాలిసెట్ ఫలితాల్లో కౌశిక ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో 85వ ర్యాంక్

అమలాపురం టౌన్: పాలిసెట్ ఫలితాల్లో అమలాపురం పట్టణం గొల్లగూడెంలోని ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాల విద్యార్థిని ఎస్.కౌశిక నాగశ్రీ 118 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 85వ ర్యాంక్ సాధించింది. జిల్లా స్థాయిలో 3వ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. కౌశికతోపాటు పి.ప్రసీద రాష్ట్ర స్థాయిలో 401వ ర్యాంక్, పి.రోహిత్ 559వ ర్యాంక్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి తెలిపారు. పాఠశాలలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో 85వ ర్యాంక్ సాధించిన కౌశిక నాగశ్రీని, ఆమె తల్లిదండ్రులను ఆదిత్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ పి.చలపతిరావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ప్రశంసించారు.



పాలిసెట్‌లో 85వ ర్యాంక్ సాధించిన కౌశిక నాగశ్రీను అభినందిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ చలపతిరావు తదితరులు

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: అమలాపురంలోని గడియారం స్తంభం సెంటర్‌లో సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పట్టణ సీఐ పి.వీరబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూర్యబలిజ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సంఘం అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మద్దుల రవి నాగేశ్వరరావు, కాశే సురేష్, యండమూరి శివ కేశవ, మద్దుల గోపాలకృష్ణ, సరిదే రమణ, భాస్కర్ల రవితేజ, గూడూరి సురేష్, ఘంటసాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై సర్వే

మున్సిపల్ కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: పట్టణంలోని వీధి వ్యాపారుల వివరాల సేకరణకు సర్వే నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో గురువారం జరిగిన సమావేశంలో కమిషనర్ రాజు మాట్లాడారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీధి వ్యాపారస్తుల వివరాల సేకరణకు నిర్దేశించిన సర్వే మార్గ దర్శకాలపై చర్చించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో ఉన్న వీధి వ్యాపారుల వివరాలను సేకరిస్తూ సర్వే చేయాలని కమిషనర్ రాజు మెప్మా సిబ్బందిని ఆదేశించారు. సర్వేలో పట్టణంలోని వార్డు సచివాలయాల సిబ్బంది కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సందర్భంగా సర్వే యాప్‌పై మెప్మా, వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయాల అధికారులు సర్వేకు వచ్చినప్పుడు వీధి వ్యాపారులు సహకరించాలని, అవసరమైన సమాచారాన్ని అందజేయాలని కమిషనర్ రాజు సూచించారు. డీపీఎంయూ శ్రీనివాస్‌తో పాటు మెప్మా రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఐ.పోలవరం : మండలంలోని తిల్లకుప్ప గ్రామంలో ఇటీవల సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదానికి గురై మూడిళ్లు దగ్ధమైన ఘటనలో సర్వం కోల్పోయిన బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనిచ్చింది. ప్రమాదంలో పళ్ళ రాంబాబు , పళ్ళ అర్జున్, పళ్ళ వెంకటరావు బాధిత కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ), వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతి రాజు గ్రామంలో గురువారం పర్యటించారు. ఈ మేరకు సంస్థ తరఫున బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు, వంట సామగ్రి, రగ్గులు, కూరగాయలు, బియ్యం, చీరలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు శేఖర్, పి.అర్జున్, ఎం.ఎస్.ఎన్. రాజు, పి.సుబ్బరాజు, పి.చంటి, కె.కృష్ణ, కె.దొరబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణ, వీఆర్వో మహేష్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ రత్న ప్రసాద్ పాల్గొన్నారు.



బాధితులకు బియ్యం బస్తాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

భారీ వర్షంతో రహదారుల జలమయం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తాపంతో ఇబ్బంది పడిన స్థానికులు ఒక్కసారిగా ఉపశమనం పొందారు. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృత్తమై చల్లని గాలులు వీచాయి. ఓ పక్క ఎండ తీవ్రత, మరో పక్క విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయంతో ఇబ్బంది పడిన స్థానికులు వర్షం కురవడంతో సేదతీరారు. కురిసిన వర్షానికి గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది రైతులు అవస్థలు పడినప్పటికీ, పట్టణ ప్రజలు ఉపశమనం పొందారు. భారీ వర్షానికి పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. శ్రీదేవి మార్కెట్ రోడ్డు, కాలేజీ రోడ్డు, ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద నుంచి ఈదరపల్లి వైపు వెళ్లే ప్రధాన రోడ్డు, సావరం, కుంకాల వీధి తదితర రోడ్లు, వీధులు వర్షపు నీటితో నిండాయి. గంట సమయం పాటు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో డ్రైనేజీల్లో మురుగునీరు రహదారులను ముంచెత్తాయి. సాయంత్రం ఆరున్నర గంటల తరువాత వర్షం కాస్త వీడింది. వర్షానికి కురిసిన సమయంలో దాదాపు పట్టణంలో జన జీవనం స్తంభించింది. ఈదరపల్లి వంతెన వద్ద వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

అమలాపురం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో భారీ వర్షం పడింది. ఈదురుగాలులతో కామనగరువు, సవరప్పాలెం పాటు పలు గ్రామాల్లో చెట్లుపై విద్యుత్తు వైర్లు పడడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. సమనస పంచాయతీలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద చింతచెట్టు రోడ్డుపై విరిగి పడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వర్షానికి ధాన్యం రాసులు తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందారు.



జలమయమైన అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్ రోడ్డు

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్



నడిపూడి లాకులు వద్ద కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



యానాంలోని కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌ఏవో మునిస్వామి, అధికారులు



పత్తిగొందిలో కాటన్ మహాశయునికి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి గురవారం ఘనంగా జరిగింది. నల్లవంతెన- ఎర్ర వంతెన మధ్య గల బైపాస్ రోడ్డులో ఉన్న జల వనరుల శాఖ కార్యాలయం ప్రాంగణంలో గల సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం వద్ద స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ ప్రతినిధులు ఏవీపీ నాగేంద్ర, నూకల సత్యనారాయణ, గోటేటి గంగాధర్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి చింతలపూడి సత్తిబాబు, వలవల శివ రావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: కాటన్ జయంతి సందర్భంగా అమలాపురం మండలం నడిపూడి లాకులు వద్ద కాటన్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు , నడిపూడి సర్పంచ్ చెల్లుబోయిన నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కాటన్ మహనీయుడు ధవలేశ్వరంలో ఆనకట్ట కట్టి కోనసీమకు తాగునీరు, సాగునీరు అందించారన్నారు. కౌన్సిలర్ల దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కముజు రమణ, రాయుడు బాల, కట్టా బుజ్జి, వాసంశెట్టి వాసు,కుడిపూడి దుర్గరావు పాల్గొన్నారు.

యానాం: సముద్రంలో వృథాగా పోతున్న గోదావరి జలాలను ఒడిసిపట్టే విధంగా ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మాణం చేసి ఉభయగోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో సాగునీరుతో పాటు తాగునీరు అందించిన సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడు చిరస్మరణీయులని ఆర్ఏవో మునిస్వామి చెప్పారు. గురువారం కాటన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీ రహదారిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1852లో కాటన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన బ్యారేజ్ వందేళ్లకు పైగా మన్నికలో ఉండడం అయన ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనమన్నారు. ఆర్థర్ కాటన్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ అడలరసన్, ఎస్ఐ పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, పిఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లు రాజబాబు అధ్యక్షతన కాటన్ జయంతి నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ ధవళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలను సశ్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని పలువురు కొనియాడారు. మండల సాగునీటి సంఘం డీసీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, సర్పంచ్ పంపన రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

యానాం: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, టాపర్స్‌ను, టీచర్లను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందన సభలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులను డిజిటలైజేషన్ చేశామన్నారు. సర్కారు బడుల్లోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఏవో మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ప్రిన్సిపాల్స్ వరుగు భాస్కరరెడ్డి, రత్నప్రభ, ఎస్ఎస్ఏ ఎడిపిసి కమిడి ప్రభాకర్, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు